# తిరిగిరానిది

హైదరాబాద్‌లోని అన్నపూర్ణా స్టూడియోలో ఫ్లోర్ నెంబర్ ఒన్‌లో లంచ్ బ్రేక్‌లో సుప్రీం హీరో అమృతరావుని కలిసాడు పాత్రికేయుడు సత్యం.

"మా పత్రిక ఉగాదికి స్పెషల్ ఇష్యూని తెస్తోంది. అందులో మీ ఇంటర్వ్యూ కావాలి" అడిగాడు సత్యం.

చిన్నగా నవ్వి చెప్పాడు అమృతరావు.

"ఇంకా నన్నేం అడుగుతారు ? నేనేం చెప్పను ? ఎన్నో వందల ఇంటర్వ్యూలలోనే చెప్పాల్సిందంతా చెప్పేసాగా."

"ఇంతదాకా ఇండస్ట్రీకి వచ్చిన కొత్తల్లో మీరు పడ్డ కష్టాల గురించి ఎవరం అడగలేదు. ఈసారి అది కవర్ చేద్దాం అనుకుంటున్నాం."

మరోసారి చిన్నగా నవ్వి చెప్పాడు అమృతరావు.

"ఐ థింక్ దట్సీజ్ ఇంటరెస్టింగ్ ఏరియా .... వెల్ .... పద్మనాభంలా నేను ఇంట్లో చెప్పకుండా సినిమా మీద గ్లామర్‌తో మద్రాస్ పారిపోయి వచ్చాను. నేను ఎక్కని సినిమా కంపెనీ గుమ్మం లేదు. వేషాల కోసం అడగని డైరెక్టర్ లేడు...."

"ఇదే సంవత్సరంలో జరిగింది ?" అడిగాడు సత్యం.

"లెట్ మీ సీ.... నైన్టీన్ సెవెంటి సిక్స్."

అమృతరావు పి. ఎ. వచ్చి ఓ కాగితం చూపించాడు. దాన్ని చూడగానే అమృతరావు మొహంలో చికాకు కనిపించింది.

"సర్లే .... రాత్రికి ఆడిటర్‌తో మాట్లాడతాను. ఓసారి గుర్తు చెయ్యి" చెప్పాడు.

"మీరప్పుడు మద్రాసులో ఎక్కడుండేవారు" అడిగాడు సత్యం.

"తేనాం పేటలో తంగవేలన్ ఆయన ఇంట్లో ఓ గదిలో. నాకు ఇద్దరు రూంమేట్స్, ఒకతను అసిస్టెంట్ డైరెక్టర్ .... ఇప్పటికీ అతను అంతే. ఇంకొకతను కెమెరామెన్ అవుదామని వచ్చాడు. కాలం కలిసిరాక తెనాలి వెళ్ళిపోయి అక్కడ ఫొటోస్టూడియో పెట్టుకున్నాడు. సినిమాల్లో వేషాలువేయాలన్న ఒక్క ధ్యేయం తప్ప అప్పట్లో ఇంకో ధ్యాస ఉండేది కాదు. అవి వేయకపోతే ఇంటి అద్దె కట్టడం ఎలా? దాంతో ఇంట్లోని మిగతా పోర్షన్స్‌లోని వాళ్ళకి ట్యూషన్స్ చెప్పడానికి నా బి. ఎ. చదువు ఉపయోగించింది. రెండేళ్ళపాటు కటిక దరిద్రం అనుభవించాను. రోజుకి పావలా టీ, పదిహేను పైసల బన్‌తో ఎన్ని వారాలు గడిపానో.... పాపం మా పక్క పోర్షన్‌లోని మామ్మగారు నా సంగతి గమనించి మిగిలిన అన్నం పెడుతుండేవారు. ఆవిడ కొడుకు పోస్ట్‌మేన్. సైనికుడు, డాక్టర్, పోలీస్ కానిస్టేబుల్ లాంటి వేషాలు ఇస్తామనేవారు కాని ఎఎన్నార్, ఎన్.టి.ఆర్. లా హీరో వేషంతోనే నా కెరీర్ మొదలుపెట్టాలన్న పట్టుదలతో వున్న వాటిని నిరాకరించాను. ఆ రోజులే వేరు. డబ్బు లేకపోయినా మా లోగిలిలోని తోటి వారి ఆప్యాయతతో జీవించానని చెప్పాలి. మనిషి జీవించడానికి ఒక్క ఆక్సిజనే ముఖ్యంకాదు. కష్టకాలంలో తోటి వారి ఆప్యాయత కూడా.... ఓ త్రీ స్టార్ హోటల్‌లో సర్వర్‌గా పనిచేసే అతను పెరిగిన నా గడ్డం గీసుకోవడానికి వారానికోసారి బ్లేడు, రేజరు అరువిచ్చేవాడు.... సినిమాలో ప్రొడక్షనిస్ట్‌గా పనిచేసే ఒకాయన భార్య నేను ఉతుక్కున్న బట్టలని ఇస్త్రీ చేసి పెట్టేది.... నాకింకా గుర్తు రెహమాన్ భార్య గర్భవతిగా ఉన్నప్పుడు హార్లిక్స్ అడిగితే కొనడానికి ఆయన దగ్గర డబ్బు లేకపోయింది.... వంటిమీది బట్టలని విప్పి

హేంగర్‌కి తగిలించి టవల్ చుట్టుకుని పడుకునే వాణ్ణి....మళ్ళీ మర్నాడు అవే బట్టలు.... అవి ఉతుక్కున్నాక ఆరేదాకా ఆ టవల్‌తోనే కాలక్షేపం.... వర్షాకాలం రెండు మూడు రోజులు పేంట్ ఆరకపోతే ఆ టవల్‌తో గది దాటి బయటకు వచ్చేవాణ్ణి కాను .... మా ఇంటావిడ ఎవరికీ తెలీకుండా దొంగతనంగా కొబ్బరినూనె ఇచ్చేది...."

అమృతరావు గొంతులో ఏదో అడ్డుపడ్డట్లుగా అవడంతో చెప్పడం ఆపేశాడు. ఆనాటి వాళ్ళ ఆప్యాయతని గుర్తు తెచ్చుకుంటే అతనికి కళ్ళు చెమ్మగిల్లాయి.

"నా జీవితంలో అవి ఆర్థికంగా శనిరోజులే అయినా మానసికంగా ఎంతో ఆనందాన్నిచ్చిన అద్భుతమైన రోజులు" చెప్పాడు. సత్యం రాసుకున్నాక అడిగాడు.

"మొదటిసారి 1978 లో మీరు హీరోగా రంగ ప్రవేశం చేశారు కదా? అదెలా జరిగింది?" అడిగాడు.

"మరేం అనుకోకపోతే ఆ విషయాలు ఇంకోసారి మాట్లాడుకుందాం." చెప్పాడు అమృతరావు ఆయన మూడ్ మారిందని గ్రహించిన సత్యం శెలవు తీసుకున్నాడు.

ఒంటరిగా కళ్ళు మూసుకుని కుర్చీలో కూర్చున్న అమృతరావు మనసు మద్రాసులో తేనాంపేటలోని పదహారేళ్ళ క్రితం తను వున్న ఆ ఇంటి లోగిలిలోకి వెళ్ళిపోయింది.

రాత్రి షూటింగ్ నుంచి కృష్ణ ఒబెరాయ్‌కి చేరుకున్నాడు అమృతరావు. ఇండస్ట్రియలిస్ట్ శివారెడ్డి నుంచి మెసేజ్ ఆ రాత్రి తనింటి నుంచి కేరియర్‌లో భోజనం పంపిస్తున్నానని, కింగ్ ప్రాన్స్‌ని కొవ్వూరి నుంచి ప్రత్యేకంగా అమృతరావు కోసం తెప్పించానని.

అమృతరావు ఫోన్‌లో ఆడిటర్‌తో పావుగంటసేపు మాట్లాడాడు.

ఇన్‌కంటాక్స్ శాఖ నుంచి వచ్చిన చికాకుల గురించి తర్వాత లాయర్‌తో మాట్లాడాడు. ఆ స్తికి సంబంధించిన ఓ వ్యవహారం మీద కోర్టుకి వెళ్ళడం గురించి. ఓ పాట మిగిలిపోయింది కాబట్టి డేట్స్ అడ్జస్ట్ చేయమని, లక్షల పెట్టుబడి మీద తను వడ్డీ చెల్లిస్తున్నానని ఓ నిర్మాత ఫోన్‌లో రిక్వెస్ట్. అన్నీ చికాకు కలిగించే సమస్యల తాలూకు సంభాషణే.

ఒంటరిగా భోజనం చేస్తూ ఆలోచించాడు. ఏది కోరితే అది వచ్చే తను ఇంతకాలం ఎందుకు తెలియని వెలితిని ఫీలవుతున్నాడా అని ఆ క్షణంలో అతనికి అర్థం అయింది. ఏది కోరితే అది వస్తుందనుకుంటు న్నాడు కానీ.... తనకి కోరుకున్నా రానిది ఒకటుంది ఇక తినలేక పోయాడు. సగంలో చెయ్యి కడిగేసుకున్నాడు అమృతరావు.

* * *

మద్రాస్‌లో విమానం దిగాక కారు డ్రైవర్‌తో చెప్పాడు అమృత రావు.

"టి. నగర్ కాదు. తేనాంపేట పోనీ."

"యస్ సార్."

తేనాంపేటలో తంగవేలు ఇంటి ముందు కారు దిగాడు. లోపలికి నడిచి ఆగి చుట్టూ చూశాడు అలానే వుంది. ఏ మాత్రం మారలేదు. గానీ గోడ రంగు మాత్రం కొంత వెలిసింది. వేపచెట్టుకి కన్నాలు ఎక్కు వయ్యాయి.

తను అద్దెకున్న గది తలుపుకి తాళం వేసి వుంది. ఇంటి బయట కూర్చుని చుట్ట తాగుతున్న పోస్ట్‌మెన్ రెహమాన్‌కి కొత్తగా కళ్ళజోడు వచ్చింది. జుట్టుకూడా నెరిసింది.

"ఎవరది ? అడిగాడు రెహమాన్.

"నేను....నన్ను గుర్తు పట్టనేలేదా ?"

రెహమాన్ లేచి దగ్గరగా వచ్చి పరీక్షగా చూసి విభ్రాంతిగా అడిగాడు.

"మీరు....మీరు....అమృతరావుగారు కదండీ?"

"అవును. రెహమాన్ బావున్నావా?"

"రండి.... రండి. అంతా బయటకు రండి. ఎవరొచ్చారో చూడండి" అరిచాడు రెహమాన్ ఆనందంగా.

రెహమాన్ భార్య, సర్వర్, ఇంటావిడ, సినిమా ప్రొడక్షనిస్ట్.... అంతా బిల బిలమంటూ బయటకు వచ్చారు. కొందరు చిన్న పిల్లలుకూడా.

'హై....హై.... అమృతరావు' ఎగిరారు పిల్లలు.

"సారి అమృతరావుగారూ. మా ఇంట్లో మంచి కుర్చీలేవు" ఇంటావిడ ఓ స్టూలు తెచ్చి వేస్తే దాని మీద తన ఇస్త్రీ చీరని తెచ్చి వేసింది ప్రొడక్షనిస్ట్ భార్య మెత్తగా ఉండాలని.

పోస్ట్‌మేన్ భార్య తన కొడుకు చెవిలో చెప్పింది వెళ్ళి హార్లిక్స్ బాటిల్ కొనుక్కురమ్మని.

"కొద్దిగా అన్నం ఉంటే పెడతావా పెద్దమ్మా. బ్రేక్‌ఫాస్ట్ తీసుకోలేదు. ఆకలిగా వుంది" అడిగాడు అమృతరావు రెహమాన్ తల్లిని.

"రాత్రి చేసింది వుంది నాయనా! నువ్వు తినేది కాదు. గబ గబా వండుదామంటే రేషన్ బియ్యం, నీకు సహించదు."

హార్లిక్స్ గ్లాసుని చూసి అడిగాడు అమృతరావు రెహమాన్ భార్యని రహస్యంగా.

"మీ ఆయన హార్లిక్స్ ఎప్పట్నుంచి కొంటున్నాడు?"

"ఆయన కొనలేదు. మీ కోసం ఇప్పుడే తెప్పించాను? మా కాఫీ ఏం బావుంటుంది మీకు?"

అమృతరావు మొహం పాలిపోయింది ఆ మాట వినగానే.

"నా కోసం ఇంత ఖర్చు చేసి తెప్పించారా ?"

"అవును ఎలా కలపాలో నాకు తెలీదు మీకు నచ్చిందో లేదో ?"

"నన్ను అంతా మీరంటారేమిటి కొత్తగా ? ఇదివరకు నన్నంతా నువ్వనేవారుగా ?" అడిగాడు అమృతరావు.

"అప్పుడేదో తెలియక అలా అన్నాం" నొచ్చుకుంది ఇంటావిడ.

"నాకా మర్యాదలెందుకు ? ఎప్పటిలా వుండండి" రిక్వెస్ట్ చేశాడు అమృతరావు.

అతని మాటను ఎవరూ అర్థం చేసుకోలేదు. పావు గంటలో తంగ వేలు ఓ దండని తెప్పించి అమృతరావు మెళ్ళో వేస్తే అంతా చప్పట్లు కొట్టారు.

"ఏదో చిన్న దండ మా శక్తి మేర తెప్పించాం. మీ స్థాయికి తగ్గది కాదు. ఏం అనుకోకు నాయనా."

అమృతరావుకి ఆ పావుగంటలో అర్థం అయింది. పెరిగిన తన అంతస్తు గతంలోని వాళ్ళ ఆప్యాయతని సమాధి చేసిందని, తనకి వాళ్ళకి మధ్య పెద్ద ఇనుప తెర ఏర్పడిందని.

అమృతరావు తమ గతంలోని అమృతరావునే అని చెప్పినా వాళ్ళకి అతని ఆరాటం అర్థం కాలేదు. సుప్రీం హీరో అమృతరావునే వాళ్ళు చూశారు కానీ పదహారేళ్ళ క్రితం అమృతరావుని కాదు.

అమృతరావు మనసు బాధగా మూలిగింది. 'నేను మీలో ఒకడినే' అని అతని మనసు అరచినా అది వాళ్ళకి వినిపించలేదు.

'అసలు నేను రాకుండా వుంటే బావుండేది' అనుకున్నాడు వాళ్ళ మర్యాదకి తట్టుకోలేక. పిల్లలు పెద్దలు కూడా ఆటోగ్రాఫ్స్ తీసుకున్నారు.

"వెళ్ళొస్తాను" చెప్పి లేచాడు.

ఓ యువకుడు లోపలికి వచ్చి తను ఇదివరకు అద్దెకున్న గది తలుపు తాళం తీస్తుంటే ఎవరో చెప్పారు అతనికి అమృతరావు వచ్చారని.

అతను ఆశ్చర్యంగా, ఆనందంగా, అమృతరావు వంక చూశాడు, దగ్గరకు వచ్చి రెండు చేతులూ జోడించి నమస్కరించాడు.

"మీరిదివరకుండే గదిలో వుండే భాగ్యం కలిగింది నాకు" చెప్పాడు.

"ఏం చేస్తుంటారు మీరు" అడిగాడు అమృతరావు చినిగిన అతని చొక్కాని గమనించి.

"మీలా హీరోని అవుదామని ఏడాది క్రితం మద్రాసుకి వచ్చాను. అనేకచోట్ల ప్రయత్నిస్తున్నాను. నన్ను ఆశీర్వదించండి."

అమృతరావు చిన్నగా తల వంకించాడు. అతని భుజం తట్టి, కొన్ని క్షణాలు అతని కళ్ళలోకి చూసి చెప్పాడు. "నీకు ఎప్పుడూ నా జీవితంలోని ఈ రోజు రాకూడదని ఆశీర్వదిస్తున్నాను .... సాయంత్రం ఓసారి కనపడు."

అమృతరావు జేబులో నల్ల కళ్ళజోడు లేకపోతే అతని కళ్ళలోని నీటి పొరని అంతా స్పష్టంగా గమనించి వుండేవాళ్ళు. కారు కదిలాక కళ్ళజోడు తెరచి వెనక్కి తిరిగి చూశాడు. ఇంటి బయట నిలబడి వున్న వాళ్ళంతా చేతులు జోడించి తనకి నమస్కారాలు చేస్తూండటం కనపడింది.

(రచన సచిత్ర మాసపత్రిక 1992)